## క్లుప్తంగా

### కార్యవర్గం ఎన్నిక

సిరిసిల్లటౌన్: తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్, జిల్లా నూతన కౌన్సిల్‌ను ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కడారి.రాములు, అధ్యక్షులు కె.వి.అనసూయ, ఉపాధ్యక్షులుగా రేగుల అనిత, గుమ్మడవెల్లి మంజుల, ప్రధాన కార్యదర్శిగా అజ్జవేణు, సహాయ కార్యదర్శిగా ఊసకోయల లక్ష్మి, దాసరి గీత, కోశాధికారిగా సుంకనపెల్లి శాంత, కార్యవర్గ సభ్యులుగా దాసరి భాగ్య, గాజుల లింగం, కోడం ప్రమీల, తేలు సరోజ, ఎలా సత్తవ్వ, కౌన్సిల్ సభ్యులు లక్ష్మి, కట్ల విజయ, కర్రె పద్మ, ఫోన్నెటి విమల, కొట్టె గంగవ్వ, కొండ ఈశ్వరి, కర్రె రాజేశ్వరి, వేముల ప్రమీల తదితరులను ఎన్నుకున్నారు.

### బతుకమ్మ పాటల సదస్సు



సిరిసిల్లకల్చరల్: విశ్రాంత ఉపాధ్యాయుడు, కవి జనపాల శంకరయ్య తల్లి లస్మవ్వ పాడిన బతుకమ్మ పాటలు బాగున్నాయని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం గాంధీనగర్ హనుమాన్ మందిరంలో బతుకమ్మ పాటల పుస్తకంపై సిరిసిల్ల సాహితీ సమితి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కవులు వాసరవేని పరశురాం, చేపూరి బుచ్చయ్య, చిటికెన కిరణ్, వెంగల లక్ష్మణ్, కోడం నారాయణ, పారంద్ల మురళీధర్, తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో కట్టికోల లక్ష్మీనారాయణ, బాలరాజు, గడ్డం కౌసల్య, గడ్డం పరశురాం, శకుంతల, సింగిరెడ్డి రాజిరెడ్డి జుమ్మిడి సమ్మయ్య, గజ్జెల్లి రామచంద్రం, కొక్కుల రాజేశం తదితరులు పాల్గొన్నారు.

### మందుబాబుల ఆగడాలను అరికట్టాలి

సిరిసిల్లటౌన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం మందుబాబులకు అడ్డాగా మారిందని సీపీఎం సిరిసిల్ల పట్టణ కార్యదర్శి అన్నల్ దాస్ గణేశ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రౌండ్‌కు మూడు ఎంట్రన్స్ గేట్లు లేకపోవడంతో రాత్రి పూట మందుబాబులకు అడ్డాగా మారిందని, మద్యం సీసాలు అక్కడే పడవేస్తున్నారన్నారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, పాలకవర్గం వెంటనే స్పందించి మూడు ఎంట్రన్స్ లకు గేట్లు బిగించి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రౌండ్ లో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సూరం పద్మ, పట్టణ కమిటీ సభ్యులు సిరిమల్లె సత్యం, ఒగ్గు గణేశ్, జిందం కమలాకర్, బెజుగం సురేశ్, తదితరులు పాల్గొన్నారు

### రాజన్నకు కోడెమొక్కు చెల్లింపు



కోడెమొక్కు చెల్లిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడ: వయనాడ్ ఉప ఎన్నికల్లో ప్రియాంకగాంధీ భారీ మెజారిటీతో గెలుపొందడంతో కాంగ్రెస్ నాయకులు బుర్ర రవి తేజగౌడ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం వేములవాడ రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వివేక్, ఇమ్మడి శెట్టి విశాల్, నాగరాజు, రాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### కళాజాత



మల్యాలలో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

చందుర్తి: మండలంలోని మల్యాల, లింగంపేట, చందుర్తి గ్రామాల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీలపై ప్రజలకు పాటలు రూపంలో వివరించారు. నిరుపేదలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, ఆరోగ్య శ్రీ పెంపు, రూ.2లక్షల రుణమాఫీ పథకాలపై అవగాహన కల్పించారు. టీం లీడర్ ఎడమల శ్రీధర్‌రెడ్డి, కళాకారులు పొత్తూరి రాజు, శ్రీరాముల రాంచద్రం, గడ్డం దేవయ్య, గడ్డం శ్రీనివాస్, వంతడుపుల గణేశ్, గుగ్గిళ్ల పర్శరాములు, పూడూరు సంజీవ్, అంతడుపుల ఝూన్సీ, లావణ్య, కిన్నెర లత, అనుముల శిరీష, తదితరులు పాల్గొన్నారు.

### గోశాలకు పశుగ్రాసం అందజేత



పశుగ్రాసం అందజేస్తున్న పర్శరాములు

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ గ్రామానికి చెందిన ఈర్ల పర్శరాములు వేములవాడ రాజన్న ఆలయ గోశాలకు పశుగ్రాసం అందజేశారు. రెండు ట్రాక్టర్ల పశుగ్రాసాన్ని అందించి రసీదు తీసుకున్నారు.

# సర్కారు బడి పిల్లలు.. ఆటల్లో మెరికలు

- పల్లె నుంచి జాతీయస్థాయికి
- ప్రతిభ చూపుతున్న విద్యార్థులు
- చదువుతోపాటు క్రీడల్లో రాణింపు



వాలీబాల్ ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారిణులు

ఎల్లారెడ్డిపేట: వారంతా సర్కార్‌బడి పిల్లలు. క్రీడల్లో జాతీయస్థాయి పోటీలకు సిద్ధమవుతున్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం సాధన చేస్తూ మెరికల్లా తయారయ్యారు. జిల్లాలోని మిగతా పాఠశాలల విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మండలంలోని రాచర్ల బొప్పాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీల్లో రాణిస్తున్నారు. ఇక్కడ పనిచేసిన పీఈటీగా ప్రభాకర్, ఇటీవల బదిలీపై వచ్చిన పీఈటీ అక్బర్ షరీఫ్ పిల్లలను క్రీడల్లో నిష్ణాతులుగా తయారు చేశారు. పాఠశాల నుంచి రాష్ట్రస్థాయికి 45 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ముత్యాల మనోజ్ అనే విద్యార్థి వాలీబాల్‌లో జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. డిసెంబర్ 6 నుంచి 10 తేదీవరకు ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి వాలీబాల్ క్రీడల్లో పాల్గొననున్నారు.

### సంతోషంగా ఉంది



గత పీఈటీ ప్రభాకర్, ప్రస్తుత పీఈటీ అక్బర్ షరీఫ్ సార్‌ల ప్రోత్సాహంతో నేషనల్ స్థాయికి ఎంపికయ్యాను. పాఠశాలలో నిత్యం ఉదయం, సాయంత్రం వాలీబాల్‌లో సాధన చేసి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటాం. జాతీయస్థాయికి ఎంపికవడం సంతోషంగా ఉంది.

– ముత్యాల మనోజ్, వాలీబాల్ ప్లేయర్

### వాలీబాల్ పోటీల్లో



పాఠశాల స్థాయిలో అవకాశాలను వినియోగించుకొని వాలీబాల్‌లో పోటీల్లో రాణించా. జిల్లాస్థాయిలో నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో చాంపియన్ షిప్ గెలుచుకున్నాం. ప్రతిభను గుర్తించి రాష్ట్రస్థాయికి ఎంపిక చేయగా, మహబూబ్‌నగర్‌లో జరిగిన క్రీడాపోటీల్లో పతకాలు సాధించాం.

– పొన్నాల రిషిక, వాలీబాల్ ప్లేయర్

### రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు



జాతీయస్థాయికి ఎంపికవడమే లక్ష్యంగా సాధన చేస్తున్నాం. ప్రభుత్వ బడి అయినా జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని పతకాలు సాధిస్తున్నాం. మా ఊరి పేరును నిలబెడుతాం.

– పెద్దూర్ అమర్, వాలీబాల్ ప్లేయర్

### జాతీయస్థాయికి ఎంపికయ్యా



బొప్పాపూర్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. భవిష్యత్‌లో ఎస్సై కావడమే లక్ష్యం. గోదావరిఖనిలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో రాణించి జాతీయస్థాయికి ఎంపికయ్యా.

– చల్ల సాహితి, వాలీబాల్ క్రీడాకారిణి

### ఆనందంగా ఉంది



పాఠశాలకు చెందిన ఎంతోమంది విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం ఆనందంగా ఉంది. విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంది.

– అక్బర్ షరీఫ్, పీఈటీ, రాచర్ల బొప్పాపూర్ హైస్కూల్

## వినియోగదారులపై కక్షసాధింపు మానుకోవాలి



మాట్లాడుతున్న బియ్యంకార్ శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: సెస్ అధికారులు వినియోగదారులపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలని సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సిరిసిల్లలో ఆయన మాట్లాడారు. పట్టణంలో కొందరు సెస్ వినియోగదారులకు అధిక బిల్లులు వచ్చాయన్నారు. వాటిని సవరించాలని పలుసార్లు కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోలేదన్నారు. సీజీఆర్ఎఫ్ ఫోరం చంద్రశేఖర్ ఆశ్రయించగా ఫోరం కేసు ఉన్నా అధికారులు కరెంటు కనెక్షన్ తొలగించడం సరికాదన్నారు. ఫోరంలో కేసులు పెట్టిన వారిపై కక్ష సాధింపుకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారులు తీరు మార్చుకోవాలని సూచించారు. ఆయనతో పాటు కుసుమ గణేశ్, వేముల పోశెటి, వెంగళ వెంకటేశ్, భోగ రాజయ్య, తదితరులున్నారు.

## ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ బడుల్లో వసతులు కల్పించి సర్కారు విద్యను బలోపేతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పర్కాల రవీందర్ కోరారు. సిరిసిల్లలో ఆదివారం జరిగిన మహాసభల్లో మాట్లాడారు. తరగతి గదికో ఉపాధ్యాయున్ని నియమించాలని, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, పీఆర్సీ అమలుచేయాలని కోరారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి సమక్షంలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా పర్కాల రవీందర్, ప్రధాన కార్యదర్శిగా జంగిటి రాజు, ఉపాధ్యక్షుడిగా గుండమనేని మహేందర్‌రావు, ఉపాధ్యక్షురాలుగా నెల్లుట్ల లత, కోశాధికారిగా అంబటి రమేశ్, కార్యదర్శులుగా శివకుమార్, స్వామి, పాలాస మల్లేశం, తిరుపతి జాదవ్, కొ త్వాల్ ప్రవీణ్, మల్లేశం, లక్ష్మణ్, మలిగే శంకరయ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా శివరాత్రి సంతోష్ ఎన్నికయ్యారు.

### ప్రభుత్వవిప్‌కు వినతి



వేములవాడ: జీవో 317పై త్వరగా నిర్ణయం తీసుకొని రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలకు న్యాయం చేయాలని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌ను మైనార్టీ గురుకుల రాష్ట్ర నాయకులు ఆదివారం కలిసి విన్నవించారు. పాఠశాలల సమయం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు పాత టైం టేబుల్‌ను కొనసాగించాలన్నారు. ఇక్కడ తెలంగాణ మైనార్టీ గురుకుల అధ్యక్షుడు మాలోతు శ్రీనివాస్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ పోతు సతీశ్, కోశాధికారి వట్టిమల్ల పూర్ణచందర్ తదితరులున్నారు.

### ఆర్థికసాయం అందజేత

వేములవాడ: పట్టణానికి చెందిన తాటికొండ ప్రభాకర్ ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయపడగా కుటుంబ సభ్యులకు మై వేములవాడ ట్రస్ట్ ప్రతినిధులు ఆదివారం రూ.10వేలు ఆర్థికసాయంగా అందించారు. దాతలు స్పందించి 89785 33368 నంబర్‌లో ఫోన్ పే ద్వారా ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.

# పేరుకే దత్తత.. అభివృద్ధి ఉత్తమాటే..



ఘాట్‌రోడ్డుపై పిచ్చిమొక్కలు



మామిడిపల్లి సీతారామస్వామి ఆలయం

- మామిడిపల్లి సీతారామస్వామి ఆలయాన్ని పట్టించుకోని రాజన్న ఆలయ అధికారులు
- భక్తుల సహకారంతోనే అభివృద్ధి పనులు
- మూడేళ్లుగా సాగుతున్న ఘాట్‌రోడ్డు పనులు

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి అత్యంత ప్రాచీన ఆలయంగా పేరుంది. వేములవాడ ఆలయ దత్తత దేవాలయమై మామిడిపల్లి ఆలయ అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారు. పేరుకే దత్తత ఆలయమైనా అభివృద్ధి మాత్రం అంతంతమాత్రంగానే ఉంది. అభివృద్ధికి నిధులు ఉన్నా పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. దాతల సహకారంతోనే పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

**2004లో దత్తత**

మామిడిపల్లి ఆలయాన్ని 2004లో వేములవాడ రాజన్న ఆలయం దత్తత తీసుకుంది. కానీ ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి పనులు జరగడంలేదు. మామిడిపల్లితో పాటు దత్తత తీసుకున్న నాంపల్లి ఆలయాన్ని మాత్రం పర్యాటకకేంద్రంగా తీర్చిదిద్దారు. మామిడిపల్లి ఆలయాభివృద్ధికి పలువురు దాతలు స్పందించి సాయం అందిస్తున్నారు. కానీ వేములవాడ ఆలయ అధికారులు మాత్రం స్పందించడం లేదన్న విమర్శలున్నాయి.

**ఘాట్‌రోడ్డు పనుల్లో జాప్యం**

మామిడిపల్లి ఆలయంలో గుట్టపైకి ఘాట్‌రోడ్డు నిర్మాణం కోసం దేవాదాయ, ధర్మాదాయ శాఖనుంచి రూ.1.13 కోట్లు, ఆలయ ముఖద్వారం నుంచి ప్రధాన రహదారి వరకు సీసీరోడ్డు నిర్మాణానికి రూ.13లక్షలు మంజూరుకాగా ఈ పనులను అప్పటి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యే రమేశ్‌బాబు 2021 డిసెంబర్ 19న పనులు ప్రారంభించారు. ఈ పనులను 2023 మాఘమాస్య జాతర ఉత్సవాల్లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఇందులో ముఖద్వారం నుంచి మెయిన్‌రోడ్డు వరకు సీసీరోడ్డు పనులు పూర్తయ్యాయి. ఘాట్‌రోడ్డు పనులు మాత్రం మూడేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి.

**దాతల సహకారంతోనే అభివృద్ధి పనులు**

మామిడిపల్లి ఆలయానికి దత్తత తీసుకున్న వేములవాడ ఆలయ అధికారులు పట్టించుకోకున్నా పలువురు దాతలు స్పందించి అభివృద్ధి పనులకు ముందుకొస్తున్నారు.

- నిజామాబాద్‌కు చెందిన శ్రీనివాస్‌గౌడ్ రూ.6లక్షలతో గుట్టపైకి వెళ్లేందుకు మెట్లపై రేకులు వేయించారు.
- వ్యాపారి జనార్దన్‌రెడ్డి రూ.4లక్షలతో గదిని నిర్మించాడు.
- మామిడిపల్లిలోని మేర సంఘం ఆధ్వర్యంలో రూ. 3 లక్షలతో రేకులషెడ్డు, అశోక్‌రావు రూ. 3 లక్షలతో మరో షెడ్డు వేయించారు.
- అమెరికాలో ఉంటున్న ఎన్నారై ఆత్మారాం రూ. 5 లక్షలతో వసతిగృహం నిర్మించి ఇచ్చాడు. వీరితో పాటు మరికొందరు దాతలు తమ సహకారం అందించారు.

**ఇద్దరు ఉద్యోగుల డెప్యూటేషన్**

మామిడిపల్లి ఆలయంలో జూనియర్ అసిస్టెంట్, క్లర్క్‌గా పనిచేస్తున్న కమలాకర్, దేవయ్యను అధికారులు డెప్యూటేషన్‌పై వేములవాడలో పనిచేయిస్తున్నారు. సీనియర్ అసిస్టెంట్ నరేందర్ ఆలయాన్ని దర్శించిన దాఖలాలు లేవు. ఆలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్న అనిల్ క్లర్క్, జూనియర్ అసిస్టెంట్ విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### గుట్టపైకి వెళ్లేందుకు ఇబ్బంది



మామిడిపల్లి సీతారామచంద్రస్వామి ఆలయం మండలంలోని ప్రాచీనమైనది. ఈ ఆలయంలో ఘాట్ రోడ్డు పనులు జరుగుతూనే ఉన్నాయి. పలు ప్రాంతాలనుంచి జాతరకు వచ్చే భక్తులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు గుట్టపైకి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. – ఎల్లాల లింగారెడ్డి, మామిడిపల్లి

### ఇబ్బందుల్లేకుండా చూడాలి



మామిడిపల్లి ఆలయంలో ప్రారంభించిన పనులు కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యంతో ఏళ్లుగా ముందుకుసాగడం లేదు. మాఘమాస్య జాతర, శ్రీరామనవమి, రథోత్సవం వేడుకలు ఘనంగా జరుగుతాయి. పనులు త్వరగా పూర్తిచేసి భక్తుల ఇబ్బందులు తొలగించాలి.

– నంద్యాదుపు సాగర్, మామిడిపల్లి



ముస్తాబాద్: మండలంలోని గూడూరులో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం అసంపూర్తిగా ఉంది. మాజీ సీఎం కేసీఆర్ గూడూరు పంచాయతీ భవన నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. అయినా గ్రౌండ్ ఫ్లోర్ మాత్రమే పనులు పూర్తిచేసి, మొదటి అంతస్తు పనులను మధ్యలోనే నిలిపివేశారు. మిగులు పనులు పూర్తిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : ఇనాయతుల్లా, ఏఈ, పంచాయతీరాజ్, సెల్ నెంబర్ 9849474383



**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో సమావేశమైన పూర్వ విద్యార్థులు



ఇల్లంతకుంట: సమావేశమైన 2005 -06 బ్యాచ్ విద్యార్థులు

సిరిసిల్లటౌన్: పట్టణంలోని వెంకంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2002–2003 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం కొత్త చెరువు బండ్‌పై జరిగింది. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సిరిసిల్ల మండల విద్యాధికారి దూస రఘుపతి, తన్నీరు మల్లరావు, రాచర్ల కృష్ణమూర్తిని సత్కరించి మెమొంటోలు అందజేశారు. అనంతరం చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : మండలకేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 2005–06లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.ఉపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, కిషన్, సార మల్లేశం, పూర్వవిద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## 'కార్తీక' వన భోజనాల్లో మహిళల సందడి

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లి పద్మనాయక వెలమ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన భోజనాల వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. సుమారు 300 మంది మొదట గ్రామంలోని రోడ్‌నెం–10లో కలుసుకొని తులసి పూజచేసి విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం అందరూ సామూహిక భోజనాలు చేశారు. మహిళల ఆటా పాటలు.. నృత్యాలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీచర సంపత్‌రావు, వేణుగోపాల్‌రావు, నరేందర్‌రావు, రాంగోపాల్‌రావు, శ్రీనివాసరావు, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఇల్లంతకుంట: మహారాష్ట్రంలో బీజేపీ గెలుపొందడంపై మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆదివారం ఆ పార్టీ మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తిప్పారపు శ్రావణ్ కుమార్, మండల అధ్యక్షుడు వజ్జ పెల్లి శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు మేకల మల్లేశం, బత్తిని సాయ గౌడ్, నాగసముద్రాల సంతోష్, సాయి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

### కుక్కలకు అంతు చిక్కని రోగం



వేములవాడ: పట్టణంలో కుక్కలకు వింతరోగం మొదలైంది. జనాల మధ్యలోనే శునకాలు తిరుగుతుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు, పశు సంవర్ధక శాఖ అధికారులు స్పందించి ఇలాంటి కుక్కలను తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

### వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

సిరిసిల్ల క్రైం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. తంగళ్లపల్లి మండలం బస్వాపూర్‌కు చెందిన విజయ్ మరదలితో కలిసి బైక్‌పై వెళ్తుండగా సిరిసిల్ల నుంచి తంగళ్లపల్లి వైపు వెళ్తున్న టాటాఏస్ వాహనాన్ని రాంగ్ రూట్‌లో వచ్చి ఢీకొట్టారు. ఈప్రమాదంలో గాయపడిన ఇద్దరిని సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



గాయపడిన మహ్మద్ ఉమర్

రుద్రంగి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన మహ్మద్ ఉమర్ రుద్రంగి నుంచి కోరుట్ల వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో జీప్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఉమర్‌ను చికిత్స నిమి త్తం వేములవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు వెంటనే 108లో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడు సిరిసిల్లకు చెందిన సాయికృష్ణగా భావిస్తున్నారు.